క్లుప్తంగా

రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రామ్మోహన్ రెడ్డి

బేతంచెర్ల: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా దుకాణాల నిర్వాహకులు రశీదులు ఇవ్వాలని ఆళగడ్డ ఏడీఏ రామ్మోహన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, దుకాణదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, ఏఈఓ మధు తదితరులు పాల్గొన్నారు.

కంకరరాయి తరలిస్తున్న టిప్పర్ల స్వాధీనం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కంకర రాయి తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు డివిజనల్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుబ్బారాయుడు బుధవారం తెలిపారు. రవ్వలకొండ సమీపంలోని జీఎంఆర్ మైన్స్ వైపు నుంచి రెండు టిప్పర్లు ఇతర ప్రాంతానికి మైనింగ్ మెటల్‌ను తరలిస్తుండగా అడ్డుకున్నామన్నారు. మెటిరియల్ తరలింపునకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశామని ఆయన తెలిపారు.

సారా కేసులో ముగ్గురికి రిమాండ్

అవుకు: నాటుసారా కేసులో ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ కిరణ్ బుధవారం తెలిపారు. కొండమనాయునిపల్లె ఊరి బయట అదే గ్రామానికి చెందిన పెనుగొండ నారాయణ స్వామి, పిక్కర్లపల్లితండాకు చెందిన కాట్రావత్ భీముడు నాయక్, కాట్రావత్ జయరాం నాయక్ నాటుసారాను తరలిస్తుండగా 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వల్లంపాడులో చోరీ

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడులోని ఓ హోటల్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన మాధవి కుటుంబం ఏడాది క్రితం వల్లంపాడు గ్రామంలో స్థిరపడింది. బస్‌స్టాప్ సమీపంలో హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే రాత్రి హోటల్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి మూడు గ్యాస్ సిలిండర్లు, 12 బియ్యంప్యాకెట్లు(25కిలోలు), రూ. 5వేలు దోచుకెళ్లారు. బుధవారం యథావిధిగా మాధవి ఉదయం హోటల్‌కు వచ్చే సరికి తలుపు తెరిచి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు రేవనూరు ఎస్‌ఐ రాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన మద్దయ్య నుంచి 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

వేగంగా రహదారి మరమ్మతులు



మెరుస్తున్న బెలుం-కొలిమిగుండ్ల రోడ్డు

కొలిమిగుండ్ల: అనంతపురం-అమరావతి 544-డీ జాతీయ రహదారిపై మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. బందార్లపల్లె సమీపంలోని జిల్లా సరిహద్దు నుంచి అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల మీదుగా బెలుం వరకు జాతీయ రహదారి అస్తవ్యస్థంగా ఉండేది. చాలా చోట్ల రోడ్డు దెబ్బతినడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జాతీయ రహదారిపై ప్యాచ్ వర్కులు చేసేందుకు నిధులు మంజూరు కావడంతో ఎన్‌హెచ్ అధికారులు పనులు చేయిస్తున్నారు. కనకాద్రిపల్లెలో సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాటిని తొలగించి తారురోడ్డు నిర్మించారు. అవుకు మండలం రామాపురం నుంచి చెర్లోపల్లె వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. జాతీయ రహదారిపై ప్యాచింగ్ పనులు చేపట్టడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తొలగిపోయాయి.

మొక్కజొన్న సాగుకే మొగ్గు..!

- జులై 15 వరకు సాగుకు అవకాశం
- అనుకూలంగా మారిన ముందస్తు వర్షాలు
- సరైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి
- యాజమాన్య పద్ధతులు అవలంభించాలి



కోవెలకుంట్ల: గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగు రైతులకు అన్ని విధాలా కలిసొచ్చింది. వర్షాలు, వాతావరణం అనుకూలంగా మారడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు అయ్యాయి. రైతులకు లాభాలు గడించారు. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ముందస్తు కురిసే వర్షాలు అనుకూలంగా మారడంతో ఈ ఏడాది కూడా మొక్కజొన్న సాగు అన్ని విధాలా కలిసి వస్తుందని రైతులు కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 2,112 హెక్టార్లలో మొక్కజొన్న సాగు సాధారణ విస్తీర్ణం. రైతులు పొలాలను దుక్కిదున్ని విత్తనాలు, రసాయన ఎరువులను సిద్ధం చేసుకున్నారు. జూన్ మొదటి వారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు మొక్కజొన్న సాగుకు అదును అని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. అదేవిధంగా విత్తన రకాలు, సాగు విధానం, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షల మేరకు ఎరువులు వాడాలి. ఖరీఫ్‌లో ఎకరాకు 40 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల పోటాష్ వాడాలి. వీటిలో భాస్వరం, పోటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలోను, నత్రజని ఎరువులో 1/4వ వంతు విత్తినప్పుడు, 1/2వవంతు 30-35 రోజులకు మిగిలిన 1/4వ వంతు విత్తిన 50-55 రోజులకు వేయాలి. వర్షాధారంగా పండించే మొక్కజొన్నకు నత్రజనిని రెండు భాగాలుగా అంటే 2/3వ వంతు విత్తేటప్పుడు, మిగిలిన 1/3వ వంతు విత్తిన 35-40 రోజులకు తేమ మేరకు వేసుకోవాలి.

కలుపు యాజమాన్యం

కలుపు సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎకరాకు 800/1200 గ్రాముల అట్రజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి(లీటరు నీటికి 4-6 గ్రాములు) విత్తిన 24-25 గంటలల్లోపు పిచికారీ చేసి కలుపును నివారించుకోవచ్చు. విత్తిన 30-35 రోజులకు అంతరకృషి చేసి మట్టిని ఎగదోయాలి.

నీటి యాజమాన్యం

పూతకు ముందు, పూత దశ, పాలు పోసుకునే దశ, గింజ గట్టిపడే దశల్లో నీటి ఎద్దడికి గురి కాకుండా చూడాలి. పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. మురుగునీరు పోవడానికి ఏర్పాట్లు చేయాలి. మొక్కజొన్న పంటలో సోయాచిక్కుడు లేదా కంది లేదా ముళ్లంగిలను 1:2 నిష్పత్తిలో అంతర పంటలుగా వేసుకోవచ్చు.

సస్యరక్షణ

ఖరీఫ్‌లో విత్తనం మొలకెత్తిన తర్వాత పది రోజులకు కాండం తొలుచు చారల పురుగు ఆశిస్తుంది. పిల్లపురుగు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వ చనిపోయి పంటకు ఎక్కువగా నష్టం కలుగుతుంది. గులాబీరంగు పురుగు ఆకుల పత్రహరితాన్ని గోకి తినడంతో మొవ్వ చనిపోతుంది. ఈ రెండు పురుగుల నివారణకు విత్తిన పది రోజులకు లీటరు నీటికి 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ కలిపి పిచికారీ చేయాలి. పంట విత్తిన 10-12 రోజులకు కార్బోప్యూరాన్ 3జీ గుళికలను వేయాలి.

ఆకుమాడు తెగులు

ఆకులపైన గోలాకారంగా ఉండే బూడిదరంగుతో కూడిన ఆకుపచ్చ లేక గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు ఎండిపోయి మొక్కలు చనిపోయినట్లు కన్పిస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. డీహెచ్‌ఎం-1 రకాన్ని విత్తుకోవాలి.

ఆక్రిమోరియమ్ పడలు తెగులు

ఆకులు, కాండం ఊదారంగులోకి మారి తర్వాత కాండం మొదటి 1,2 కణుపులపై గోధుమరంగు చారలు ఏర్పడి లోపలి నాళాలు నల్లగా మారి చివరకు మొక్క ఎండిపోతుంది. సెఫలోస్పోరియా పడలు తెగులు సోకిన మొక్కలు పై నుంచి కిందకు వడలి ఆకులు లేతపచ్చరంగుకు మారి తర్వాత ఎండిపోతాయి. ఈ రెండు తెగుళ్ల నివారణకు పంట మార్పిడి, శుభ్రమైన సాగుపద్ధతులు, పుష్పించే దశ నుంచి నీటి ఎద్దడి లేకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలి. తెగులును తట్టుకునే రకాలైన డీహెచ్‌ఎం 103, 105, త్రిశూలత రకాలను సాగు చేసుకోవాలి.

పొడతెగులు

ఆకుతొడిమలపై రంగు కోల్పోయిన పెద్దపెద్ద చారలు ఏర్పడతాయి. ఈ చారల మధ్య ముదురు వర్ణపు చారలు ఏర్పడతాయి. తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆకుతొడిమ, ఆకులు మొత్తం మాడిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజమ్ లేదా ప్రాపికొనజోల్ కలిపి పిచికారీ చేయాలి.

→ నేలలు

గరప, రేగడి, లోతైన మధ్యరకపు రేగడి నేలలు అనుకూలం. మురుగునీరు నిల్వ ఉండరాదు. చౌడు నేలలు పనికిరావు.

- విత్తన రకాలు: డీహెచ్‌ఎం-103, 105, త్రిశూలత 107,109,113,115, 117 హైబ్రిడ్‌లు
- సింథటిక్స్ కాంపోజిట్స్:అశ్విని, హర్ష, వరుణ్
- ప్రత్యేక రకాలు: తీపి మొక్కజొన్న, మాధురి, ప్రియ పాప్‌కార్న్- ఎంబర్
- బేబికార్న్: హెమ్129, బీహెచ్ 2187
- క్వాలిటీ ప్రోటీన్: ఏంబర్‌శక్తి, క్యూపిఎం-1

→ విత్తన మోతాదు

హైబ్రిడ్‌లు ఎకరాకు 7 కిలోలు. స్వీట్‌కార్న్ 4కిలోల, పాప్‌కార్న్ 5 కిలోలు, బేబికార్న్ 10 కిలోలు.

- విత్తన శుద్ధి: కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయాలి.

→ విత్తే పద్ధతి

వరుసల మధ్య 60-75 సెంమీ, మొక్కకు మొక్కకు మధ్య 20-25 సెంమీ(ఎకరాకు 26వేలు- 32 వేల మొక్కల సాంద్రత)

ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న మాజీ మంత్రి వెల్లంపల్లి



యాగంటి క్షేత్రంలో వెల్లంపల్లి శ్రీనివాస్

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామిని దేవాదాయశాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఏకశిలారూపంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలోని నందీశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమం యాగంటి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, బనగానపల్లె ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ రవికుమార్, శ్రీరామవెంకట సుబ్రమణ్యం, జక్కానాగరాజు, చక్రపాణి పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి

డోన్ టౌన్ : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమంగా అడ్మిషన్‌లు చేపడుతున్న భాష్యం స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంఈఓ ప్రభాకర్‌కు పీడీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. నూతనంగా పట్టణంలో బ్రాంచి ప్రారంభిస్తున్న భాష్యం స్కూల్ యజమాన్యం భవనాలు నిర్మాణంలో ఉన్న ప్పటికీ, బ్రోచర్లు, పోస్టర్ల ప్రచారం చేస్తూ అక్రమంగా అడ్మిషన్లకు పాల్పడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పవన్ ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రవి, శ్రీరాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బనగానపల్లె రూరల్ : మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్న భోజన నిర్వహకులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాటించాల్సిన నియమనిబంధనలు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజన చేసేలా రుచిగా వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, సీఆర్‌ఎంటీలు సుధాకర్‌రావు, చంద్రుడు, శివరామ మద్దిలేటి, శివప్రసాద్, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నాం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో బుధవారం మండలంలోని వంట ఏజెన్సీ నిర్వాహకులు, సహాయకులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వంట సమయంలో పాటించాల్సిన పద్ధతులను రీసోర్స్ పర్సన్ దుర్గ వివరించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ప్యాపిలి: మధ్యాహ్న భోజన నిర్వాహకులు నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ ఆదేశించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భోజనం రుచికరంగా ఉంటే వంద శాతం విద్యార్థులు పాఠశాలలోనే భుజిస్తారన్నారు. భోజన నిర్వాహకులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ కూరగాయలు తాజాగా ఉండేలా చూసుకోవాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీజ సూచించారు.

ఓట్ల లెక్కింపులో జాగ్రత్తలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్ : జూన్ 4వ తేదీ నిర్వహించే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బంది అన్ని జాగ్రత్తలు పాటించాలని బనగానపల్లె నియోజవకర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌంటింగ్‌లో పాల్గొనే ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బంది ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్స్ ఎవ్వరికీ అనుమతిలేదన్నారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, అనంతరం ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కింపు చేపట్టాలన్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ఏ విధంగా చేయాలి, పాటించాల్సిన నిబంధనలు, అలాగే కౌంటింగ్ ప్రక్రియ, ఎన్ని రౌండ్స్‌లో పూర్తి చేయాలి తదితర అంశాలను ఆర్‌ఓ వివరించారు. కార్యక్రమంలో బనగానపల్లె అవుకు, కొలిమిగుండ్ల సంజామల కోవెలకుంట్ల మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

విష్టుకంటి క్షేత్రం ముస్తాబు

- నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో వెలసిన విష్టుకంటి క్షేత్రం 14వ వార్షికోత్సవ మహోత్సవాలకు ముస్తాబు అయ్యింది. విద్యుత్ బల్బుల వెలుగులో క్షేత్రం కళకళలాడుతోంది. గురువారం నుంచి మూడురోజులపాటు మహోత్సవాలు భక్తిశ్రద్ధతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని విష్టుకంటి క్షేత్రం కంబగిరి లక్ష్మినరసింహ స్వామి ఉపాసకులు రామ్మోహన్ స్వామి తెలిపారు. మొదటి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, అంకురార్పణ, ప్రథమ అగ్ని, నిత్యవిధి, పూర్ణాహుతి, వేదపఠనం, బ్రహ్మంగారి చరిత్ర నాటక ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రెండవ రోడు శుక్రవారం స్వామివారికి 108 కలశాభిషేకం, అన్నకూట ఉత్సవం, గోవర్ధనగిరిధారి అలంకారం తదితర పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా మూడోరోజు శనివారం ఆదిలక్ష్మి సిద్ధలక్ష్మీ సమేత కంబగిరి లక్ష్మీ నరసింహస్వామివారి తిరుకల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగనుంది. సాయంత్రం గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవంతో క్షేత్రం వార్షికోత్సవ మహోత్సవాలు ముగుస్తాయని రామ్మోహన్ స్వామి తెలిపారు.



కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి



విద్యుత్ అలంకరణలో స్వామివారి ఆలయ ముఖద్వారం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జూన్ 4న ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు సహకరించండి
- పకడ్బందీగా పోలీసు యాక్ట్, 144 సెక్షన్ అమలు
- కౌంటింగ్ కేంద్రాలకు అభ్యర్థులు, ఏజెంట్లకు మాత్రమే అనుమతి
- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల కౌంటింగ్ జూన్ 4వ తేదీన పాణ్యం సమీపంలోని ఆర్‌జీఎం, శాంతిరామ్ మెడికల్ కళాశాలల్లో ఉంటుందని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతిఒక్కరూ గమనించి మెలగాలని సూచించారు. స్థానిక షాదీఖానాలో బుధవారం అఖిల పక్ష రాజకీయపార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అనుమతులున్న అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు తప్పా ఎవ్వరు కూడా కౌంటింగ్ కేంద్రాలకు రాకూడదని, ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరు తమ వాహనాలను నిర్దేశించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలని, ఎక్కడ పడితే అక్కడ ఉంచితే పోలీసు స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు పట్టణ, గ్రామీణ ప్రజలు తమ ప్రాంతాల్లోనే ఉండడం మంచిదని, అనవసరంగా నియోజకర్గం కేంద్రాలకు వచ్చి ఇబ్బందులు పడొద్దని సూచించారు. గతం, ప్రస్తుతం రౌడీషీటర్లుగా పేరు నమోదు, నేర చరిత్ర ఉన్న వ్యక్తులను అభ్యర్థులు తమవెంట ఉంచుకోరాదన్నారు. అలాంటి వ్యక్తులు తప్పనిసరిగా స్థానిక పోలీసు స్టేషన్‌లో 4వ తేదీ హాజరు కావాలని ఆదేశించారు.

సంయమనం పాటించాలని

రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణమని, అభ్యర్థులతోపాటు మద్దతుదారులు సంయమనం పాటించాలని డీఎస్పీ సూచించారు. గెలుపు ఆనందం, ఓడిపోయిన బాధ అంటూ అనుచరులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా ఏ మాత్రం ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు నిషేధమని, టపాసులు కాల్చడం, రంగులు చల్లుకోవడం, డీజేలు, డ్రమ్స్ తదితర సంబరాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా సోషల్ మీడియాలో ఇతరులను రెచ్చగొట్టేలా, కించపరిచేలా వ్యవహరించినా, పోస్టింగులు పెట్టినా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పోలీసు యాక్ట్, 144 సెక్షన్ అమలు నేపథ్యంలో అనవసరంగా వాహనాల్లో తిరగరాదని మద్యం, విందులు తగవని, కర్రలు, రాళ్లు, మారణాయుధాలు ఉండకూడదన్నారు. అభ్యర్థులు, రాజకీయ నాయకులు ఈ విషయాలన్ని దృష్టిలో ఉంచుకోని కౌంటింగ్‌రోజు తమ అనుచరులను నియంత్రించుకోవాలని సూచించారు. సమావేశంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి సీఐలు ప్రవీణ్‌కుమార్, అస్రత్‌బాషా, ప్రియతంరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి

బేతంచెర్ల: జూన్ 4వ తేదీన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున్న 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలు ఉంటుందని సీఐ ప్రియతం రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. మండల, నియోజకవర్గ కేంద్రాలతో పాటు కౌంటింగ్ ప్రాంతాలకు ఎవ్వరూ రావద్దన్నారు. అదేవిధంగా విజయోత్సవాలు నిషేధమని, గొడవలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె : జూన్ 4వ తేది సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతర గ్రామాల్లో అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ తిరుపాల్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని నందివర్గంలో ఎస్‌ఐ తిరుపాల్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో ఎస్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, పోలీసు 30యాక్ట్ అమలులో ఉందని, విజయోత్సవ సభలు, ర్యాలీలు సంబరాలు చేయరాదన్నారు. ఏ పార్టీ అభ్యర్థులు విజయం సాధించినా ఇతరులను రెచ్చగొట్టే ప్రవర్తించొద్దని సూచించారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిరుపాల్

పంచాయతీ కార్యదర్శి స్థానికతపై విచారణ

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు స్థానికతపై డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవా రం గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. 2022లో కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు స్థానికంగా ఉండటం లేదంటూ గ్రామస్తుడు మునీర్ బాషా ఆర్టీఐ ద్వారా సమాచారం కోరారు. పంచాయతీ కార్యదర్శి స్థానికతపై అప్పట్లో డీపీఓ విచారణ జరిపారు. సరైన సమాచారం రాలేదంటూ మునీర్ బాషా కోర్టులో రిట్ దాఖలు చేశారు. దీంతో పూర్తి విచారణకు డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఈఓఆర్డీలు వెంకటేశ్వర్లు, మహీధర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ షాను, పంచాయతీ కార్యదర్శులు సరళమ్మ, నరేంద్రతో పాటు గ్రామపెద్దల ఆధ్వర్యంలో విచారణ జరిపారు. నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు.

మంచి నీటిని వేడిచేసుకుని తాగాలి

డోన్ టౌన్ : వర్షాకాలం నేపథ్యంలో మున్సిపల్ కుళాయిల నీటిని వేడిచేసి చల్లార్చి వడపోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ సూచించారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో కమిషనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ ప్రజలతో మంచినీటి సరఫరా నీటి నాణ్యతపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు వ్యాప్తిచెందకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ జయరామ్

వ్యక్తిపై దాడి

డోన్ రూరల్ : స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట మరుగుదొడ్ల వద్ద పనిచేస్తున్న నిథిలేష్‌కుమార్‌పై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశారని రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా నిథిలేష్‌కుమార్ ఇవ్వకపోవడంతో దాడికి పాల్పడ్డారన్నారు. ఈ మేరకు బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని చెప్పారు.

ముమ్మరంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు



ఆల్వకొండలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సంజామల: మండలంలో 20 రోజు క్రితం కురిసిన వర్షానికి దాదాపు 300 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిస్థానంలో సిబ్బంది ముమ్మరంగా నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం ఆల్వకొండ, రెడ్డిపల్లె గ్రామాలలో కొత్త స్తంభాలను సిబ్బంది ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 200 స్తంభాలను ఏర్పాటు చేశామని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు.